క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన



ఓటుపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై గురువారం అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఫణికుమార్, రవికిరణ్‌కుమార్, మంజుల, లలితకుమారి పాల్గొన్నారు.

నాగూరులో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు గ్రామంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక సర్పంచ్ కె.శిరీషా ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు ఆస్పత్రి వైద్యులు డా.వేణుగోపాల్, వేణుమాధవి, డా.ఆదర్ష్ రోగులకు తనిఖీలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయనున్నట్టు ఏరియా మేనేజర్ ఎం.రాజేష్ తెలిపారు. శిబిరానికి విచ్చేసిన రోగులకు అవసరమైన తాగునీరు తదితర ఏర్పాట్లు చేశారు.

జేఈఈ ఫలితాల్లో భాగ్యశ్రీ ప్రతిభ



శివ్వాల దుర్గా భాగ్యశ్రీ

పాలకొండ రూరల్: ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పాలకొండ పట్టణానికి చెందిన శివ్వాల దుర్గా భాగ్యశ్రీ 99.94 పర్సంటైల్ దక్కించుకున్నారు. ఈమె తండ్రి ఎస్.తవిటినాయుడు ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐఓగా శ్రీకాకుళంలో విధులు నిర్వహిస్తున్నారు. తల్లి శివశ్రీ ప్రభుత్వ ఉపాధ్యాయిని. తమ కుమార్తె విజయం పట్ల తల్లితండ్రులు, సహచరులు ఆనందం వ్యక్తం చేశారు.

చురుగ్గా శివరాత్రి ఏర్పాట్లు



గుంప సోమేశ్వర ఆలయం వద్ద రహదారిని పరిశీలిస్తున్న డీఎం దుర్గ

కొమరాడ: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన గుంప సోమేశ్వర ఆలయంలో జరిగే శివరాత్రి పూజలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పార్వతీపురం ఆర్టీసీ డీఎం ఆర్‌వీఎస్ దుర్గా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు రూట్ మ్యాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం వయా గంగారేగువలస మీదుగా ఆలయం సమీపం వద్దకు వెళ్లేలే చర్యలు తీసుకుంటామా..? లేదా కోటిపాం కాలనీ మీదుగా నేరుగా గుడి వద్దకే నడపాలా అనేది ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ఇరువైపులా జంగిల్ క్లియిరన్స్ చేయాలని సర్పంచ్ సుంకరి సుగణకు కోరామన్నారు. ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాలను అధిగమించే క్రమంలో ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతపై అవగాహన అవసరమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తంగి వేణుగోపాలరావు అన్నారు. పాలకొండ సత్యసాయి విద్యా సంస్థల్లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపరాదని, సీట్ బెల్ట్ వాడాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. హెల్మెట్ వాటడం వలన కలిగిన ప్రయోజనాలు, మద్యం సేవించి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం వలన కలిగే అనర్థాలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడ్

వీరఘట్టం: మండల కేంద్రంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.80 లక్షల విలువ గల 5 ఎంవీఏ సామర్థ్యం గల కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వీరఘట్టం సబ్‌స్టేషన్‌లో అమర్చేందుకు చర్యలు చేపట్టింది. శుక్రవారం నుంచి ఈ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ట్రాన్స్‌కో ఏఈ డి.బాలాజీ తెలిపారు. పనులు జరగనున్న క్రమంలో 20 రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



నాడు - నేడులో రూపుదిద్దుకున్న పాఠశాల



రైతుల కోసం నిర్మించిన ఆర్‌బీకే సెంటర్

కొండాపురంలో కొత్త కాంతులు

- రూ.కోటితో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల రూపంలో రూ.8.16కోట్ల లబ్ధి
- నాడు - నేడులో పాఠశాలల సంపూర్ణ అభివృద్ధి



సేవలు అందిస్తున్న గ్రామ సచివాలయం



కోనేరు గట్టుకు రక్షణ గోడ

పాలకొండ: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ముందుకు సాగుతున్నాయి. మండలంలోని కొండాపురంలో కొత్త కాంతులు విరజిమ్ముతున్నాయి. ఈ సచివాలయం పరిధిలో రూ.కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించారు. అలాగే సంక్షేమ పథకాలు గ్రామంలో దాదాపు అన్ని ఇళ్లకు చేరాయి.

పక్కా భవనాలు ఏర్పాటు

గ్రామంలో ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేందుకు రూ.25లక్షలతో సచివాయల భవనం నిర్మాణం పూర్తి చేశారు. మరో రూ.25 లక్షలతో రైతు భరోసా కేంద్రం సుందరంగా నిర్మాణం చేసి రైతులకు సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామీణ హెల్త్ సెంటర్ కోసం మరో రూ.20లక్షలు మంజూరు చేసింది ప్రభుత్వం. ప్రస్తుతం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ద్వారా గత నాలుగేళ్లుగా విశేషంగా సేవలు అందుతున్నాయి. గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు ధాన్యం కొనుగోలు శతశాతం రైతు భరోసా కేంద్రం ద్వారానే పూర్తి చేశారు. కోనేరు గట్టుకు రూ.4లక్షలతో రక్షణ గోడ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మరో రూ.20లక్షలు ప్రభుత్వం మంజూరు చేసి కాలువలు, సీసీ రహదారుల నిర్మాణం కోసం చర్యలు తీసుకుంది.

సంక్షేమ పథకాలు అందుతున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషితో గ్రామంలో సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయి. ఎటువంటి వివక్షత లేకుండా పథకాలు నేరుగా మాకే అందిస్తున్నారు. వారి దయతో గ్రామంలో షాపు పెట్టుకుని కుటుంబ పోషణ చేసుకుంటున్నాం. సీఎంకు రుణపడి ఉంటాం. – లంక జయలక్ష్మి

మెరుగైన సేవలు



గతంలో చిన్న పని కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అందుకోసం ఎవరినో ఆశ్రయించాల్సి ఉండేది. ప్రస్తుతం సచివాలయం ఏర్పాటుతో మాకు ఇక్కడే పనులు జరుగుతున్నాయి. నా భర్త చనిపోతే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. పలు రకాల ధ్రువీకరణ పత్రాలు ఇక్కడే ఉచితంగా అందించారు. ఇంటి నిర్మాణం కోసం స్థలం ప్రభుత్వం అందించింది. – పడాల ధనలక్ష్మి

సంక్షేమ బావుట...

గ్రామంలో సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా జరుగుతుంది. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి నెలా రేషన్ సరుకుల పంపిణీ, పింఛన్ల పంపిణీ లబ్ధిదారుల ఇళ్ల వద్దనే చేపడుతున్నారు. ఇప్పటికే ఈ నాలుగేళ్లలో పలు పథకాల కింద నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు రూ.8.16లక్షలు ప్రభుత్వం అందించింది. ఇది కాకుండా నాన్ డీబీటీ ద్వారా మరో రూ.రెండు కోట్లు నిధులు ప్రభుత్వం అందించింది.

పి.ఆమిటిలో పాఠశాలను పునఃప్రారంభించాలి



నిరసన తెలుపుతున్న పి.ఆమిటి గ్రామానికి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు

గుమ్మలక్ష్మీపురం: ద్రవ్య సహాయక పాఠశాలను పునఃప్రారంభించేలా విద్యాశాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని మండలంలోని పి.ఆమిటి గ్రామస్తులు డిమాండ్ చేశారు. సర్పంచ్ తాడంగి దమయంతి ఆధ్వర్యంలో మూతపడిన పాఠశాలను పునఃప్రారంభించాలని కోరుతూ గ్రామస్తులు మూతపడిన పాఠశాల ముందు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో స్థాపించబడిన ద్రవ్య సహాయక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు 2021లో అనారోగ్యంతో మృతి చెందిందని తెలిపారు. ఆ సమయంలో యాజమాన్యం సకాలంలో స్పందించకపోవడంతో ఉపాధ్యాయుల నియామకం జరగలేదని.. ఫలితంగా తమ గ్రామానికి చెందిన 21 మంది విద్యార్థులు సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపాలపురం, మొరమ గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను ప్రభుత్వంలో విలీనం చేయాలని యాజమాన్యం కూడా ప్రభుత్వానికి అంగీకార పత్రం అందజేసినప్పటికీ..అనివార్య కారణాల వలన ప్రభుత్వంలో విలీనం కాలేదన్నారు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూతపడ్డ తమ గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తూ.. పునఃప్రారంభించి గ్రామంలోని విద్యార్థులకు గ్రామంలోనే విద్యను అందించే ఏర్పాట్లను చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

సచివాలయం ఉద్యోగుల అసంతృప్తి

మండలంలోని పి.ఆమిటి గ్రామ సచివాలయం ఉద్యోగులపై పి.ఆమిటి తదితర గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఉదయం 10 గంటల సమయం దాటినప్పటికీ సచివాలయం వద్దకు ఉద్యోగులెవరూ రాకపోవడంతో ఆయా పనుల నిమిత్తం వచ్చిన పలు గ్రామాల గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులంతా సమయపాలన పాటించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరారు.

ఉచితంగా ఎర్రబెండ విత్తనాల పంపిణీ



పంపిణీకి సిద్ధం చేసిన ఎర్రబెండ విత్తనాలు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో పండించిన ఎర్రబెండ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి తెలిపారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్‌లో ఏడాది పొడవున పండించిన ఎర్రబెండకు సంబంధించిన విత్తనాలను భద్రపరిచామన్నారు. ఈ విత్తనాలు ఎవరికైనా కావాలంటే 8186943936, 9493905631 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

మోదీ ప్రభుత్వ విధానాలపై నేడు సమ్మె



వ్యాపారులకు కరపత్రాలు అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం తలపెట్టిన పారిశ్రామిక సమ్మె - గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరంగి గోపినాయుడు, సీపీఎం గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల కార్యదర్శులు పువ్వల ప్రసాద్, మండంగి సింగన్న తదితరులు కోరారు. బంద్‌కు మద్దతునివ్వాలంటూ గురువారం గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లోని వ్యాపారులు, దుకాణదారులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందని, రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పర్చాలని, భూ హక్కుల చట్టం 22ను, అటవీ హక్కుల చట్టం సవరణను ఉపసంహరించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలని తదితర డిమాండ్లతో నిర్వహించే సమ్మెకు ప్రజలంతా మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


మెరుగైన వైద్య సేవలందించాలి

గుమ్మలక్ష్మీపురం: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ అన్నారు. మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యాధికారి త్రివేణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ భద్రగిరి ఆస్పత్రికి వచ్చే రోగులను ఎక్కువగా పార్వతీపురానికి రిఫర్ చేస్తున్నారంటూ మండల ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారని, వచ్చే రోగులకు సాధ్యమైనంత వరకు స్థానికంగానే వైద్యసేవలందించాలన్నారు. అనంతరం వైద్య సేవలపై సమీక్షించారు. సమావేశంలో వైద్యులతో పాటు మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంధ్య, అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఐటీడీఏ పెట్రోల్ బంకు

పాలకొండ: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో పాలకొండలోని సీతంపేట రహదారిలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ అందుబాటులోనికి రానుంది. శుక్రవారం ఈ బంక్‌ను స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, పలు రాజకీయ పార్టీల నాయకులు

పాలకొండ రూరల్: నగర పంచాయతీలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపించాలని ప్రజలు, పలు రాజకీయ పార్టీల నాయకులు నినదించారు. గురువారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. నగర పంచాయతీ కార్యాలయానికి చేరిన ఈ ర్యాలీ ద్వారా కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. 20వ వార్డులో ప్రస్తుతం నిర్వహిస్తున్న తాత్కాలిక డంపింగ్ యార్డు కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ సూర్యనారాయణ అధికారులు వివరించారు. దాదాపు నాలుగేళ్లగా మూడు వార్డుల ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ చొరవతో మండలంలోని అట్టలి సమీపంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న డంపింగ్ యార్డు పనులు పూర్తికి కృషి చేయాలని, పట్టణం నుంచి ఈ సమస్యకు స్వస్తి పలకాలని 20, 1వ వార్డుల కౌన్సిలర్లు గంటా సంతోషకుమార్, పల్లా రాంబాబు కోరారు. సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, బీజేపీ నాయకులు కారెపు చిట్టిబాబు, జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు తదితరులు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

ఎమ్మెల్యే పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బడే చిన్నంనాయుడు బుధవారం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు గురువారం పరామర్శించారు. వారి వెంట శిఖబడి సర్పంచ్ కోట రమేష్, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు మరడాన కిశోర్ ఉన్నారు.

ఎమ్మెల్యే కళావతిపై ఆరోపణలు తగవు

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని రాజకీయంగా ఎదుర్కోలేక టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వండవ మాజీ సర్పంచ్ విశ్వాసరాయి విజయకుమారి అన్నారు. గురువారం ఆమె వండవలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే కళావతి తాత, తండ్రి తమ సొంత భూమి వందల ఎకరాలను పేదలకు ధారాదత్తం చేశారని అన్నారు. వాస్తవ విషయాలను మరిచి టీడీపీ నేత నిమ్మక జయకృష్ణ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.

హర్షం

గుమ్మలక్ష్మీపురం: తెలుగు జాతి ముద్దు బిడ్డ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు (పీవీ), ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్‌లను దేశ అత్యున్నత పౌర పురస్కారానికి ఎంపిక చేస్తూ, వీరి అపారమైన సేవలకు పట్టం కడుతూ 'భారత రత్న' ప్రకటించడం పట్ల గుమ్మలక్ష్మీపురం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నవభారత ఆర్థిక రూపశిల్పి, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రగతిపథంలో పరుగులు పెట్టించిన అపర మేథావి పీవీ అని... ప్రజలు పస్తులుండే దుస్థితి పోవాలని, అధిక దిగుబడులిచ్చే కొత్త వంగడాలను సృష్టిస్తూ, ఇసుక నేలల్లోనూ సైతం పసిడి రాశులు పండించొచ్చని నిరూపించిన గొప్ప వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ అంటూ చిన్నారావు కొనియాడారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీరఘట్టం: వీరఘట్టం, పాలకొండ మండలాల పరిధిలో ఉన్న నవగాం, వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్లలో శుక్రవారం మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు ట్రాన్స్‌కో ఎ.డి. టి.గోపాలకృష్ణ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణం దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ చంద్రమౌళి అన్నారు. సీతంపేట రహదారిలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఒకే ఆటోలో 25 మంది ప్రయాణికులను తరలించడాన్ని ఆయన గుర్తించి ఆటో డ్రైవర్‌కు మందలించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలలో ఎక్కువగా నిబంధనలు పాటించక పోవడంతోనే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమష్టిగా అభివృద్ధి ప్రణాళికలు



సమావేశంలో పాల్గొన్న డీఎల్‌పీఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా ప్రణాళికలు చేయాలని డీఎల్‌పీఓ ఎం.నాగభూషణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గుర్తించిన అభివృద్ధి పనుల ప్రణాళికలను ఇ-గ్రామ స్వరాజ్ (పీఎఫ్ఎంఎస్)లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామానికి కావల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, డీఆర్‌పీ టీఓటీ ఎ.గణపతిరావుతో పాటు వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

'భోజనం' బాగుండాలి



ఆదర్శ పాఠశాలలో స్టాక్ వివరాలను ప్రిన్సిపాల్ రామలక్ష్మిని అడిగి తెలుసుకుంటున్న ఎంఈఓ

కురుపాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ ఎస్.సత్యనారాయణ ఆదర్శ పాఠశాల సిబ్బందికి, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భోజనం బాగోటం లేదని తమ తల్లిదండ్రులకు తెలియజేయగా తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ సత్యనారాయణ, ఎంఈఓ -2 రాధాకృష్ణ ఆదర్శ పాఠశాలకు వెళ్లి ఆదర్శ పాఠశాల సిబ్బంది, భోజన నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు ప్రతీరోజు సరఫరా చేస్తున్న ఆహారం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, నాణ్యత లేకుంటే అటువంటి ఆహారాన్ని పక్కన పెట్టాలని మెనూ ప్రకారం సరఫరా చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బియ్యం, నిత్యావసర సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. పదిహేను రోజుల పాటు భోజన నిర్వహణ పరిశీలన బాధ్యతను సీఆర్‌పీలకు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ టీం వేసి ఇకపై భోజన నిర్వహణను పరిశీలించే చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏలో రెండో రోజు సామూహిక దీక్షలు



సామూహిక దీక్షలు చేస్తున్న సీహెచ్‌డబ్ల్యూలు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ముఖద్వారం వద్ద సీహెచ్‌డబ్ల్యూలు రెండో రోజు గురువారం సామూహిక నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పని చేసే 2361 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. వేతనం పెంచాలని, యూనిఫాం, రికార్డులు, మెడికల్ కిట్లు టీఏ, డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, సోములమ్మ, శిరీష పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం..



గురండిలో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని దిమ్మిడిజోల, గురండిలో పలు కారణాల చేత కుటుంబ యజమానులు మృతి చెందగా ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దిమ్మిడిజోలకు చెందిన బిడ్డిక కామేశ్వరరావు(40) బుధవారం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో మృతి చెందారు. గురండిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పప్పల సుగ్రీవులు(47) మృతి చెందగా ఆయా కుటుంబాలను ఆమె గురువారం పరామర్శించారు. ఆమె వెంట పార్టీ నాయకులు తోట సింహాచలం, గెల్లంకి రమేష్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ వరహాలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద మౌలిక వసతుల పరిశీలించారు. వెలుతురు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామ శివారున కేంద్రం ఉండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆయనతో పాటు ఎన్నికల డీటీ, వీఆర్‌ఓలు ఉన్నారు.